క్లుప్తంగా

వైభవంగా గణపతి కల్యాణం


మాచవరంలో గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు

అంబాజీపేట: మాచవరం గ్రామ పంచాయతీ సమీపాన వేంచేసిన సిద్ధి, బుద్ధి సమేత యువగణపతి స్వామి వారి కల్యాణాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడమంచలి వెంకటకృష్ణ నాగేశ్వరరావుశర్మ పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ కొంపెల్ల రఘునాథశాస్త్రి బ్రహ్మత్వంలో తాళం రామకృష్ణ, గోపిలక్ష్మి దంపతులతో స్వామి వారి దివ్య కల్యాణాన్ని జరిపారు. దొమ్మేటి త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు, చిరంజీవి, శివ వినోద్‌కుమార్‌ల సహకారంతో భారీ అన్నసమారాధన చేశారు. 10, 12 వరకు స్వామి వారి వసంత పూజలు, 13న త్రిశూల స్నానం, 14న స్వామి వారికి పుష్పోత్సవం జరపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి


మామిడికుదురు: అపరిష్కృతంగా ఉన్న పింఛన్‌దారుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోనసీమ జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మామిడికుదురులో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ అధ్యక్షుడు జీవీ సత్యనారాయణ, అధ్యక్షుడు ఎం.అప్పారావు, కార్యదర్శి జి.హనుమంతరావు, ట్రెజరర్ జి.నరసింహారావులు మాట్లాడుతూ పింఛనర్లకు బకాయి ఉన్న డీఆర్, ఏరియర్స్ సత్వరం చెల్లించాలన్నారు.

సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర ఉన్నతం


పాశర్లపూడిలో కస్తూరిని సన్మానిస్తున్న సర్పంచ్ సూర్యప్రకాశరావు

మామిడికుదురు: సమాజం అభివృద్ధిలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైందని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాశర్లపూడిలో ఏఎన్ఎం జుత్తుగ కస్తూరిని గురువారం ఘనంగా సత్కరించారు. కరోనా సమయంలో ప్రాణాపాయ స్థితికి వెళ్లి కోలుకుని కస్తూరి గ్రామస్తులకు విశేషమైన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అప్పనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జయజయం కోనసీమ సేవా మండలి, కోనసీమ ఎన్జీవోల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు హెచ్ఎం సాయిబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ బొంతు నీలిమ పాల్గొని ప్రసంగించారు. స్వీపర్ కన్నమ్మను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా మండల టీం సభ్యులు బి.చందు, గద్దం సురేంద్ర, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

1991 మంది రైతులకు సీ-క్లాస్ పట్టాలు


పి.గన్నవరం మండలంలో సీ-క్లాస్ లంకలను పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

పి.గన్నవరం: కొత్తపేట డివిజన్ పరిధిలో 1991 మంది రైతులకు ఐదేళ్ల కాల పరిమితితో సీక్లాస్ లంకలకు లీజు పట్టాలు ఇవ్వనున్నట్టు ఆర్డీఓ ఎం.ముక్కంటి తెలిపారు. మండలంలోని పలు లంకగ్రామాల్లో గురువారం ఆయన సీ-క్లాస్ పట్టా భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పి.గన్నవరం మండలంలో 1545 మంది రైతులకు, అంబాజీపేట మండలంలో 51, అయినవిల్లిలో 19, రావులపాలెంలో 63, ఆత్రేయపురం 257, ఆలమూరులో 56 మంది రైతులకు ఐదేళ్ల లీజు పరిమితితో పట్టాలు ఇవ్వనున్నట్టు ఆర్డీఓ ముక్కంటి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, టీడీ బి.గోపాలకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: మండలంలోని సమనసలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 9 నుంచి 11 ఏళ్ల మధ్య వయసు విద్యార్థులు అర్హులన్నారు. ఏప్రిల్ 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు పాఠశాలలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భౌతిక్క దాడులు

- బయటకు వెళ్లాలంటే కుక్కల భయం
- మూడు నియోజకవర్గాల్లో గాయాలపాలైన 1473 మంది
- రోజురోజుకూ పెరుగుతున్న పిచ్చికుక్కలు

అంబాజీపేట: రోజురోజుకూ పిచ్చికుక్కలు స్వైరవిహారం చేయడంతో బయటకు వెళ్లాలంటే ప్రజలు హడలిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ముఖ్య కూడళ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోను పిచ్చికుక్కల సంచారం ఎక్కువైంది. పిచ్చికుక్కలు కరవడంతో గాయాలపాలై ఆస్పత్రుల పాలవుతున్న వారి సంఖ్య ప్రతి రోజు పెరుగుతుంది. గ్రామాల్లోని చిన్నారులు, వృద్ధులు, మహిళలతో పాటు కోళ్లు, మేకలపై తరచూ కుక్కలు దాడి చేస్తున్నాయి. ఈ కుక్కలను నిర్మూలించేందుకు పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో రెండు నెలలుగా 1473 కేసులు నమోదయ్యాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఎక్కడ చూసినా వీధి కుక్కలు బాటసారులను, వాహనాలపై వెళుతున్న వారిపై దాడి చేసిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. స్థానికులు ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది. గడిచిన రెండునెలల్లో ఆయా గ్రామాల పీహెచ్‌సీల పరిధిలో అంబాజీపేట 74, అయినవిల్లి 84, పి.గన్నవరం 154, అవిడిలో 32, గోపాలపురంలో 86, లక్కవరంలో 128, లూటుకుర్రులో 30, మోరిలో 103, ముక్కామలలో 47, నగరంలో 89, నాగుల్లంకలో 31, రామేశ్వరంలో 50, ర్యాలిలో 95, సఖినేటిపల్లిలో 46, తాటిపాకలో 40, టి.జిబలంకలో 115, వానపల్లిలో 35, వీరవల్లిపాలెంలో 30, సీహెచ్‌సీ కొత్తపేటలో 204 కేసులు నమోదయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను అమలాపురం ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించినట్లు వైద్యాధికారులు చెప్పారు. ఇటీవల కాలంలో నివాస ప్రాంతాల్లో ఆరుబయట పనులు చేసుకుంటున్న మహిళలపైనే అధికంగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయని, వైద్యం కోసం వచ్చిన వారు మహిళలే ఉన్నారని పీహెచ్‌సీ సిబ్బంది చెబుతున్నారు. రహదారికి అడ్డంగా సంచరిస్తున్న కుక్కలను చూసి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలను నిర్మూలించాలని, ప్రజల భద్రతపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


అంబాజీపేటలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

వీధి కుక్కల సంచారం ఎక్కువైంది



వాహనాల వెంబడి తరుముకుని రావడంతో ప్రమాదాల బారిన పడినవారు ఉన్నారు. విద్యార్థులను పాఠశాలలకు పంపాలన్నా, మహిళలు ఆరుబయట పనులు చేసుకోవాలన్నా భయాందోళనకు గురవుతున్నారు. ఏ సమయంలో ఏ కుక్కలు వచ్చి కరుస్తాయోనని భయపడుతున్నారు. తక్షణమే వీధి కుక్కలను అరికట్టేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఉందుర్తి నాగబాబు, అంబాజీపేట

అందుబాటులో మందులు



అన్ని పీహెచ్‌సీల వద్ద కుక్కకాటు మందులు అందుబాటులో ఉన్నాయి. కుక్క కరిచిన ప్రాంతాన్ని సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. తీవ్రంగా గాయపడిన వారిని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి వచ్చి టీకా వేయించుకోవాలి. అవసరాన్ని బట్టి మందులను వేసుకోవాలి. కుక్క కరిచిన వారు ఆహార నియమాలు పాటించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎం.దుర్గారావుదొర, డీఎంఅండ్‌హెచ్‌వో, అమలాపురం

మాతాశిశు సంరక్షణకు 'అమ్మకోసం' యాప్

రాజోలు: మాతా శిశు సంరక్షణ కోసం సెంటర్ ఫర్ ఇన్నోవేటివ్ పబ్లిక్ సిస్టమ్స్, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ రూపొందించిన అమ్మకోసం యాప్ ఆరోగ్య సిబ్బందికి ఎంతో ఉపయోగపడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారిక సీహెచ్ ఫణికిరణ్ అన్నారు. గురువారం తాటిపాక పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు అమ్మకోసం యాప్‌పై అవగాహన సమీక్ష నిర్వహించారు. గర్భిణులు, చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలు తెలుసుకునేందుకు, వాటిని డిజిటలైజేషన్ చేసేందుకు 6,500 కుటుంబాలను సర్వే చేస్తున్నారన్నారు. సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాస్, ప్రొఫెసర్ డాక్టర్ అయ్యాంకి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నరేంద్రపురంలో గడప గడపకూ..

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురంలో శుక్రవారం ఉదయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మొండెపులంక, 4 గంటలకు నాగుల్లంక గ్రామాల్లో గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు.

మిత్ర పురుగులను కాపాడుకుందాం

మలికిపురం: దాళ్వా సాగులో మిత్రపురుగుల పరిరక్షణ ప్రధాన కర్తవ్యమని మండల వ్యవసాయాధికారి(ఏవో) ఎస్.రాకేష్ పేర్కొన్నారు. విశ్వేశ్వరాయపురంలో గురువారం జరిగిన వైఎస్సార్ పొలంబడిలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇష్టానుసారం ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల మిత్ర పురుగులు చనిపోయే అవకాశం ఉందన్నారు. వాటి పరిరక్షణపై శిక్షణ ఇచ్చారు. అలాగే తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో నివారణ మార్గాలను అనుసరించాలని వివరించారు. తద్వారా మెరుగైన దిగుబడులతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంట దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, మండలి జిల్లా సభ్యుడు గుబ్బల రమేష్, రైతులు బీటీవీ సత్యనారాయణ, మందపాటి వెంకట సత్యనారాయణ, కుక్కల శ్రీనివాస్, అసిస్టెంట్‌లు థెరిస్సా, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


పొలంబడిలో మిత్రపురుగుల రక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

మామిడికుదురు: గెద్దాడ శ్మశాన వాటికను ఏర్పాటు చేసిన తరువాతే 216 ఎన్‌హెచ్ రోడ్డును నిర్మించుకోవాలని గెద్దాడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక రహదారుల పనుల వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ శ్మశాన వాటికను ఆనుకుని సర్వే నెం.42(1.38) సెంట్లు భూమిని నుండి ఎన్‌హెచ్ రోడ్డు వేస్తున్నారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా పక్కనే ఆనుకుని ఉన్న సర్వే నెం.41 (1.10) సెంట్లు భూమిని కేటాయించి ఇస్తామని ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. సుమారు 5 ఏళ్ల నుండి కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ నెల 9వ తేదీన శ్మశానవాటికలో రోడ్డు వేయుటకు ప్రయత్నం చేయడంతో అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. శ్మశాన వాటికకు ఇవ్వవలసిన స్థలాన్ని ఏర్పాటు చేసిన తరువాతే రోడ్డు వేయాలని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జవ్వాది సత్తిబాబు, గూటం వెంకటేష్, కలిగితి రాజేష్‌కుమార్, గుబ్బల ప్రసాద్, ఉచ్చుల కమలాకర్, యడ్ల నాగరాజు, గుబ్బల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గెద్దాడలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

దాతల సహకారం వెలకట్టలేనిది

అంబాజీపేట: శిథిలమైన ప్రాథమిక పాఠశాల భవన శ్లాబు నిర్మాణానికి అవసరమైన మొత్తాన్ని అందించి నిర్మిస్తున్న దాతల సహకారాన్ని వెలకట్టలేనిదని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. నందంపూడి శివారు ముహర్రాల చెరువు గట్టులో గత ఏడేళ్లుగా శిథిలమై ఉన్న ప్రాథమిక పాఠశాల భవన శ్లాబ్ పనులను గురువారం ప్రారంభించారు. శ్లాబ్ నిర్మాణ పనులను ఎంపీపీ పరిశీలించి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలన్నారు. ఈ శ్లాబ్ నిర్మాణానికి, భవన మరమ్మతులకు అవసరమైన రూ.3 లక్షలను కాకినాడకు చెందిన బెంగళూరులో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అయిన ఇళ్ల శ్రీకల్యాణ్, శ్రీవీణ దంపతులు సమకూర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు నంద్యాల జీవీఎన్‌కే నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మట్టపర్తి బాలాజీ, మట్టపర్తి నాగేశ్వరరావు, బొక్కా వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు.


నందంపూడిలో పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు శ్రీనివాసరావు, అన్నాజీరావు, ప్రశాంత్‌లు గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు, సభ్యులు నల్లా రాధాకృష్ణ, ఫణికుమార్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు నల్లా పెదకాపు, తోలేటి దొరబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి వై.శ్రీవల్లి ఆధ్వర్యంలో 31 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. పాలకొల్లు బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్స్ బీవీ వీఎస్ఎన్ మూర్తి, ఎన్‌వీ రంగనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేట: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు అన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముక్కామల పీహెచ్‌సీ వద్ద గర్భిణీలకు పౌష్టికాహారాన్ని, మందులను వైద్యాధికారి ఎ.ఇంద్రావతి ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. డాక్టర్ ఇంద్రావతి మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతకుముందు గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బండారు మల్లిబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, నూకపెయ్యి చిన్న, ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు యు.సురేష్, వి.త్రిమూర్తులు, ట్రెజరర్ యు.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో గర్భిణులకు పౌష్టికాహారం, మందులు అందిస్తున్న వైద్యాధికారి ఇంద్రావతి

మాతృ, శిశు మరణాల నివారణకు పీఎంఎంఎస్‌ఏ

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల, ఆలమూరు వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా గురువారం సుమారు 128 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిదిన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్‌ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.


పి.గన్నవరం సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

రావులపాలెం: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జగనన్న కాలనీలో తగిన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు వేగవంతం చేసినట్టు కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో) ఎం.ముక్కంటి అన్నారు. గురువారం ఆయన మండలంలోని వెదిరేశ్వరంలో హౌసింగ్ పేదలందరికీ ఇళ్లు పథకం మంజూరైన లబ్ధిదారులతో జగనన్న కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని సూచించారు. అలాగే జగనన్న కాలనీలో మౌలిక వసతులైన విద్యుత్, రోడ్లు, తాగునీరు సౌకర్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.కరుణాకరం, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, హౌసింగ్ డీఈఈ జి.శ్రీనివాస్‌ప్రసాద్, ఏఈ జేజిబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. తొలుత స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో ముక్కంటి రెవెన్యూ సిబ్బందితో సమావేశం అయ్యారు. విలేజ్ సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.


వెదిరేశ్వరంలో హౌసింగ్ లబ్ధిదారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో ముక్కంటి

నేడు సర్వసభ్య సమావేశం

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తాడి వెంకటాచార్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు, పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

వార్డు సభ్యుడు రాజారావుపై నిర్భయ కేసు

అంబాజీపేట: ఓ మహిళా ఉద్యోగి విధులకు ఆటంకం కలిగిస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్న కె.పెదపూడి వార్డు సభ్యుడు బీర రాజారావుపై నిర్భయ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ గురువారం తెలిపారు. గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌ను వార్డు సభ్యుడు రాజారావు చెప్పిన ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలంటూ వేధిస్తున్నాడని ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) పి.శ్రావణి ఫిర్యాదు చేసిందన్నారు. శ్రావణి ఇచ్చిన ఫిర్యాదుతో రాజారావుపై నిర్భయ కేసు, అతడిని ప్రోత్సహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.మధుబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్, హెల్త్ రీజినల్ డైరెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓలకు పిర్యాదు చేసినట్లు ఆమె తెలిపిందని ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికీ గాయాలు

అయినవిల్లి: మండలంలోని ఎస్.పెదపాలెం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమలాపురం నుంచి ఎస్.పెదపాలెం వస్తున్న ఎస్.పెదపాలేనికి చెందిన కె.వెంకటేశ్వరరావుని అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లికి చెందిన షేక్ వలీ ముక్కామల నుంచి అమలాపురం వస్తూ ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. వీరిరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని 108లో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో కె.వెంకటేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. వైద్యులు ఉన్నత వైద్యం కోసం తరలించాలని సూచించినట్లు తెలుస్తోంది. దీనిపై తమకు ఏ విధమైన ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు చెబుతున్నారు.

రబీకి పూర్తి స్థాయిలో సాగునీరు

పలివెల లాకులకు యుద్ధప్రాతిపదికన షట్టర్ల ఏర్పాటు

కొత్తపేట: బొబ్బర్లంక-అమలాపురం ప్రధాన పంట కాలువపై పలివెల వద్ద చెడిపోయిన లాకుల షట్టర్స్ స్థానే కొత్త షట్టర్స్ ఏర్పాటు చేశారు. మండలంలోని పలివెల లాకుల షట్టర్స్ చెడిపోవడం వలన వంతుల వారీ విధానంలో 7.8 అడుగుల నీటి మట్టాన్ని కట్టినా నాలుగింటిలో రెండు షట్టర్స్ పాడైపోవడం వలన తగిన ఫలితం ఉండటం లేదు. లాకుపై చానల్స్‌కు రావాల్సిన నీటిలో సుమారు మూడో వంతు నీరు కిందికి పోతుందని ఇటీవల రైతులు వాపోయారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఈ సమస్యతో పాటు నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల వరి ఆయకట్టుకు సాగు నీరు సమస్యపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత రబీ పంటను గట్టెక్కించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించడం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. లాకు సమస్యను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకువెళ్లి, రిపేర్లకు రూ.3.5 లక్షలు మంజూరు చేయించారు. దాంతో విజయవాడలో కొత్త షట్టర్స్ యుద్ధప్రాతిపదికన తయారు చేయించారు. వాటిని గురువారం ఎంపీపీ మార్గన గంగాధరరావు, పి.గన్నవరం ఇరిగేషన్ డీఈఈ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో బిగించారు. ఎంపీపీ గంగాధరరావు అధికారులతో మాట్లాడుతూ వంతుల వారీ విధానంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు తగినంత నీటిమట్టం కట్టి, లాకుపైన వరి ఆయకట్టు అంతటికీ సాగునీరు సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వరి పంట ఈనిక దశలో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వంతును పెంచాలని కోరారు.


పలివెల లాకులకు కొత్తషట్టర్స్ పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, డీఈఈ వెంకటేశ్వరరావు

ఆటో అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

కొత్తపేట: ప్రయాణికులతో వెళుతున్న ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట మండలం వానపల్లి శివారు సత్యాలవారిపేటకు చెందిన సత్యాల పళ్లంరాజు గురువారం మధ్యాహ్నం తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని నరసాపురం వెళ్తున్నాడు. కొత్తపేట శివారు ఏనుగులమహల్ వద్ద కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించే ప్రయత్నంలో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పళ్లంరాజుతో పాటు మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదు చేయవలసివుందని ఎస్సై మణికుమార్ తెలిపారు.

వైభవంగా శ్రీనివాస తులాభారం


తిరుప్పావడ సేవలో పులిహోరతో వేసిన వేంకటేశ్వర స్వామి ఆకృతి

రావులపాలెం: స్థానిక శ్రీ అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదకొండో రోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే పలు పూజలు నిర్వహించారు. అలాగే ఎనిమిది గంటలకు తిరుప్పావడ సేవ నిర్వహించారు. సుమారు 50 కేజీల పులిహోర ఇతర పదార్థాలతో వేంకటేశ్వర స్వామి ఆకృతిలో స్వామికి నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీనివాస తులాభారం లడ్డు పటికబెల్లం, పంచదార, బియ్యం, అటుకులు ధనం, వెండి, బంగారంతో స్వామి వారికి తూకం వేసి లడ్డూ పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు లడ్డూలను పాటలో దక్కించుకున్నారు. వీరికి దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి చేతుల మీదుగా లడ్డూలను అందజేశారు.

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణ తరగతులు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ కార్యనిర్వాహక సంచాలకుడు మల్లికార్జునరావు

అమలాపురం రూరల్: స్థానిక రైతు శిక్షణ కార్యాలయంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించి శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన శాఖ కార్యనిర్వాహక సంచాలకుడు నేతల మల్లికార్జునరావు మాట్లాడుతూ వ్యాపార వ్యవహారాలతో పాటు నాణ్యత, మార్కెటింగ్, ప్యాకింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ట్రైనర్ అమర్ కిరణ్ ఆహార పరిశ్రమల్లో ప్యాకింగ్ చేసే పద్ధతులు, మార్కెటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎండుకొబ్బరి స్వీట్స్, బేకరీ, పచ్చళ్లు, పప్పు దినుసులు, పూతరేకులు వంటి మొత్తం 22 రకాల ఆహార ఉత్పత్తులపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి ఎం.దిలీప్‌కుమార్, డి.వెంకటేశ్వరరావు, కె.స్వామి తదితరులు పాల్గొన్నారు.